క్లుప్తంగా

పీహెచ్‌సీకి నీటి సౌకర్యం కల్పించండి

ఒంగోలు రూరల్: నూతనంగా కరవదిలో నిర్మించిన ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో మంచినీటి సరఫరా నిలిచిపోయింది. నాలుగో తరగతి ఉద్యోగులు బబుల్ వాటర్ వారికి అందిస్తున్నారు. వాటర్ ప్యూరిఫయర్ వాటర్ లేక నిలిచిపోవడంతో రూ.20 వాటర్ బాటిల్స్ కొనుగోలు చేసి తాగునీటిని అరకొరగా గొంతు తడుపుకుంటున్నట్లు వైద్యారోగ్య సిబ్బంది తెలిపారు. నిర్మాణ సమయంలో వేసిన బోరుగాని మల్లవరం పైపు నుంచి గాని తక్షణం జిల్లా ఉన్నతాధికారులు తాత్కాలిక మండల వైద్యాధికారిగా విధులు నిర్వర్తిస్తున్న మెడికల్ ఆఫీసర్ తగు చర్యలు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, వైఎస్సార్ మెడికల్ యూనియన్ నాయకుడు, ఎంపీహెచ్‌ఈవో కృష్ణారెడ్డి కోరారు.

యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి

ఒంగోలు: ఎయిడెడ్ ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా కార్యవర్గ సమావేశం తీర్మానించింది. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన కార్యవర్గ సమావేశం అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ ప్రభాకరరెడ్డి వివరాలు మీడియాకు వెల్లడించారు. గుర్తింపు రెన్యువల్ చేసుకోని దొనకొండ ఇందిరాగాంధీ ఓరియంటల్ పాఠశాల, అర్ధవీడు ఎస్ఎస్ఆర్ఎం ప్రాథమిక పాఠశాలలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్నారు. ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని, కారుణ్య నియమాకాలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

మహిళ జీవనోపాధికి సహకారం

ఒంగోలు అర్బన్: పేద మహిళ జీవనోపాధికి సూర్యశ్రీ ట్రస్టు పండ్ల బండిని ఏర్పాటు చేసి సహాయం అందించింది. మంగళవారం స్థానిక ట్రస్టు కార్యాలయం వద్ద సదరు తోపుడు బండిని ట్రస్టు సభ్యులు అందజేశారు. ఏకాంబరం జ్యోతిశ్రీ తల్లి మరణించడం, తండ్రి వదిలేసి వెళ్లడంతో గోపాలనగరంలో పెంపుడు తల్లి వద్ద ఉంటోంది. అయితే ఆమె పేదరికం కారణంతో తిండి కూడా తినలేని పరిస్థితి ఉండటం తెలుసుకున్న ట్రస్టు సభ్యులు ఆమె జీవనోపాధికి రూ.15 వేలతో పండ్లు అమ్ముకునేలా పండ్ల బండి అందించారు. దీనిలో ట్రస్టు సెక్రటరీ సర్దార్‌బాషా, షహనాజ్, మారెళ్ల సుబ్బారావు, షేక్ మహబూబ్, మండవ సుబ్బారావు, నేరళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిమజ్జనానికి ట్రాఫిక్ నిబంధనలు ఇవే

ఒంగోలు టౌన్: వినాయక చవితి పురస్కరించుకొని ఒంగోలు రూరల్ గ్రామాల నుంచి గణేష్ నిమజ్జనానికి కొత్తపట్నం సముద్రానికి వెళ్లే వాహనాలకు నగరంలో ఎలాంటి ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ ఆంక్షలను విధించినట్లు ట్రాఫిక్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపట్నం వెళ్లే వాహనాలకు నగరం నుంచి వెళ్లేందుకు అనుమతి లేదని తెలిపారు. పేర్నమిట్ట, లింగంగుంట, త్రోవగుంట, వెంకటేశ్వరకాలనీలకు చెందిన వాహనాలు కిమ్స్‌ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీదుగా కొత్త పట్నం సముద్రానికి వెళ్లాల్సి ఉంటుందన్నారు. అలాగే సూరారెడ్డి పాలెం, పెళ్లూరు, చెరుకుంపాలెం, యరజర్ల నుంచి వాహనాలు పెళ్లూరు ఓవర్ బ్రిడ్జి మీదుగా కొత్తపట్నం వెళ్లేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఒంగోలు మండలాలకు చెందిన నిర్వాహకులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభం



సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ తేళ్ల చంద్రశేఖర్

చీమకుర్తి: కార్పొరేషన్ 40వ డివిజన్ రెడ్డిపాలెంలో రూ.20 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం స్థానిక కార్పొరేటర్ తేళ్ల చంద్రశేఖర్ ప్రారంభించారు. గత 15 సంవత్సరాలుగా సిమెంట్ రోడ్లు లేక స్థానిక ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మేయర్ గంగాడ సుజాత దృష్టికి తీసుకుపోగా వారి ఆధ్వర్యంలో మంజూరు చేసిన నిధులతో పనులు చేపట్టారు.

హెచ్‌ఎంకు ఘన సన్మానం

త్రిపురాంతకం: ఎస్సీ,ఎస్టీ బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుడిగా పదోన్నతి పొంది బదిలీపై వచ్చిన ఉపాధ్యాయుడు జి.ఏడుకొండలును మంగళవారం ఘనంగా సన్మానించారు. మండలంలోని గణపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడు ఏడుకొండలు పదోన్నతి పొంది మద్దిపాడు మండలం తెల్లబాడు నుంచి బదిలీపై వచ్చారు. ఈయన్ను సన్మానించిన వారిలో ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్ బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు ఇస్తర్ల వెంకట సుబ్బారావు, కె.బుజ్జి, జోసఫ్, ఉపాధ్యాయులు భాస్కర్, నరేష్, శంకర్, రవి, బాలరాజు, సుభానీ పాల్గొన్నారు.

గణేష్ మహరాజ్‌కీ జై..



కొత్తపట్నంలో ఏనుగు వాహనంపై వినాయక గ్రామోత్సవం



కరవదిలో అభయాంజనేయ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం



నేలటూరివారిపాలెం, గురవారెడ్డి పాలెం ఏర్పాటు చేసిన 14 అడుగుల వినాయకుడు

మద్దిపాడు: మండలంలోని భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో వినాయక చవితి నిర్వహించారు. గ్రామాల్లో యువకులు కమిటీలుగా ఏర్పడి వినాయక విగ్రహాలు కూడళ్లలో ఏర్పాటు చేసి పందిళ్లు ఏర్పాటు చేశారు. పందిళ్ల వద్ద చిన్నారులకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. స్వామివారికి ఉభయదాతలు పలు రకాల నైవేద్యాలు సమర్పించి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. యువకులు రాత్రి సమయాలలో విగ్రహాల వద్ద ఉండాలని పోలీసులు కమిటీ సభ్యులకు తెలిపారు. నేలటూరి వారిపాలెం గురవారెడ్డి పాలెం రహదారిలో యువకులు హైదరాబాదు నుంచి రెండు లక్షల రూపాయల వ్యయంతో 14 అడుగుల వినాయక విగ్రహాన్ని తెప్పించి నెలకొల్పారు. ఈ సంవత్సరం ప్రత్యేకంగా 180 కేజీల లడ్డూ ఏర్పాటు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

చీమకుర్తి: వినాయక చవితి సందర్భంగా చీమకుర్తి రెడ్డి బజార్, గాంధీనగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో జరిగిన పూజల్లో అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు మారం వెంకారెడ్డి మంగళవారం పాల్గొని పూజలు నిర్వహించారు. స్థానిక భక్తులతో కలిసి స్వామి వారి ఆశీర్వాదాలు స్వీకరించారు.



చీమకుర్తి: పూజా కార్యక్రమాల్లో మారం వెంకారెడ్డి

కొత్తపట్నం: వినాయక చవితికి చలువ పందెళ్లు వేసి అందులోకి వినాయక విగ్రహాలను చేర్చారు. సోమవారం మేళతాళాలతో పూజలు చేశారు. విగ్రహాలు ముందు పొంగళ్లు, కుడుములు పోసి పురోహితుల వేద మంత్రాలతో పూజలు చేశారు. కొత్తపట్నంలో కై కాలావారి పాలెం భక్తులు ఏనుగు వాహనంపై వినాయకుడిని అలంకరించి గ్రామోత్సం నిర్వహించారు.

ఒంగోలు మెట్రో: నగరంలో గంటాపాలెం పార్వతమ్మగుడి దగ్గర, మంగమూరు రోడ్డు గాయత్రి మందిరం దగ్గర, కొణిజేడు బస్టాండ్ సిద్ధి బుద్ధి వినాయక స్వామి గుడి దగ్గర రంగుతోట, తూర్పు కమ్మపాలెం, గొడుగుపాలెం కొండయ్య బంకు దగ్గర, మంగమూరు రోడ్డు గాంధీ రోడ్డు ప్రధాన వీధులలో గణేష్ మండపాలను ఏర్పాటు చేశారు. వినాయకుడి పూజను స్థానిక భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మంగమూరు డొంక గాంధీనగర్‌లో నాలుగో వీధిలో గణనాథునికి పట్టు వస్త్రాలను అలంకరించి వివిధరకాల పూలతో చక్కగా స్వామి వారిని అలంకరించారు. సాయంత్రం స్థానిక భక్తులు అధిక సంఖ్యలో వినాయకుని వ్రత కథను శ్రద్ధగా విని అక్షింతలను స్వామి వారి భక్తి పూర్వకంగా సమర్పించుకుని గణనాథుని ఆశీస్సులు అందుకున్నారు.

ఒంగోలు రూరల్: వినాయక చవితి పర్వదినం సందర్భంగా వినాయకుని విగ్రహాలు మండలంలోని అన్ని గ్రామాల్లో వీధుల్లో ఏర్పాటు చేశారు. సోమవారం మధ్యాహ్నం నుంచి వేదపండితులు వేదమంత్రాలు శాస్త్రోక్తంగా, శాస్త్ర బద్ధంగా జపిస్తుండగా ప్రత్యేకంగా వినాయక విగ్రహాలను స్టేజీల వద్ద ప్రతిష్ఠించారు. ఒక్కో గ్రామానికి 5 సరాసరి విగ్రహాలను ఏర్పాటు చేశారు. మండపం వద్ద విద్యుత్ కాంతులు పోటాపోటీగా ఏర్పాటు చేశారు.



వినాయక పూజలో స్థానిక యువకులు



గుండ్లాపల్లి సెంటర్‌లో విగ్రహం వద్ద గణేష్ యూత్ సభ్యులు



కరవది: విద్యుత్ దీపకాంతులతో కళకళలాడుతున్న వీధులు

జెడ్పీటీసీ అంత్యక్రియలకు హాజరైన ఎమ్మెల్యే



ఖనన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబుతో తేళ్ల పుల్లారావు, నాయకులు



తేళ్ల భాగ్యలక్ష్మి (ఫైల్)

మద్దిపాడు: మండలంలోని అన్నంగిలో జెడ్పీటీసీ ఖనన కార్యక్రమానికి సోమవారం ఉదయం ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు హాజరయ్యారు. జెడ్పీటీసీ తేళ్ల భాగ్యలక్ష్మి గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో ఆసుపత్రిలో ఉన్నారు. ఆదివారం ఒంగోలులోని ప్రైవేటు ఆసుపత్రిలో మృతి చెందారు. సోమవారం ఉదయం భాగ్యలక్ష్మి భర్తకు తోడుగా శాసన సభ్యుడు టీజేఆర్ సుధాకర్‌బాబు నడిచి ఖనన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం తేళ్ల పుల్లారావుకు కుమార్తె, కుమారులను దగ్గరకు తీసుకుని తాను అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. సోదరి భాగ్యలక్ష్మి మృతి చెందడం పట్ల ఆయన తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఎంపీపీ వాకా అరుణకోటి రెడ్డి, నాగులుప్పలపాడు పార్టీ కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు పలువురు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు మైనంపాడు క్రీడాకారులు



పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

చీమకుర్తి: సంతనూతలపాడు మైనంపాడు ప్రభుత్వ హైస్కూలుకు చెందిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ క్రీడాపోటీలకు ఎంపికైనట్లు మంగళవారం పీఈటీ టి.రవి తెలిపారు. ఈనెల 21 నుంచి 23 వరకు ఎన్టీఆర్ జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. అండర్ - 17 విభాగంలో హెమీమా, అలేఖ్య, అండర్- 14 విభాగంలో రమ్యప్రియ, ఐశ్వర్యజ్వాల ఉన్నారు. మైనంపాడు ప్రభుత్వ హైస్కూలు నుంచి రెజ్లింగ్ క్రీడలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వంగా ఉందని హెచ్‌ఎం నరసింహారావు, స్కూలు గేమ్స్‌ఫెడరేషన్ సెక్రటరీ వనజ, స్కూలు కమిటీ సభ్యులు, టీచర్‌లు అభినందించారు.

రైతులకు రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలి

బేస్తవారిపేట: ఎరువులు, పురుగుమందుల దుకాణాల యజమానులు తప్పనిసరిగా రైతులకు రసీదులు ఇవ్వాలని గిద్దలూరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు డి.బాలాజీనాయక్ అన్నారు. మంగళవారం బేస్తవారిపేటలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలను తనిఖీ చేశారు. రూ.2 లక్షల ఎరువులకు ఓ ఫారం లేకపోవడంతో అమ్మకాలను నిలుపుదల చేశారు. ఏఓ జక్కం మెర్సీ, ఏఈఓలు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

దర్శి: తన కోరిక తీర్చాలని అసభ్యకరంగా మాట్లాడి కర్రతో తలపై కొట్టారనే ఫిర్యాదు మేరకు ఎస్సై రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దర్శి పుచ్చల మిట్టలో నివాసం ఉంటున్న చింతలపూడి క్రాంతి, ముద్దాయి షేక్ లతీఫ్‌లు గత మూడు సంవత్సరాలుగా సహజీవనం చేస్తున్నారు. వీరిద్దరికి మధ్య మూడు నెలల నుండి మనస్పర్థలు వచ్చాయి. క్రాంతి అద్దంకి రోడ్డులోని టీవీఎస్‌షోరూం వద్ద ఉండగా.. ముద్దాయి లతీఫ్ వచ్చి అసభ్యకరంగా మాట్లాడి ఆమెతో గొడవ పడి కర్ర తీసుకుని తలపై కొట్టాడు.

రామతీర్థం నుంచి సాగర్ జలాలు



నీటి నిల్వ సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఒంగోలు కమిషనర్ వెంకటేశ్వరరావు



కరవది డొంక ప్రాంతంలో కార్యక్రమం నిర్వహిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: రామతీర్థం నుంచి సాగర్ కాలువ ద్వారా ఒంగోలు నగరంలోని ఎస్ఎస్ ట్యాంకులకు వస్తున్న నీటిని మంగళవారం ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, ఇంజినీరింగ్ సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. సాగర్ ఫీడర్ కెనాల్స్‌కు వెళ్లే కాలువల్లో మెష్‌లకు అడ్డుగా ఉన్న చెత్తా, చెదారాలను ఒంగోలు నగర పాలక సంస్థ సిబ్బందితో తొలగింపజేశారు. ఒంగోలు నగర ప్రజల తాగునీటి ఎద్దడిని నివారించేందుకు బాలినేని ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు.

ఎస్ఎస్ ట్యాంక్-1 లో గరిష్ట నీటినిల్వ 1950 మిలియన్ లీటర్లకు గాను ప్రస్తుతం 1423.49 మిలియన్ లీటర్లు నిల్వ ఉందన్నారు. ఎస్ఎస్ ట్యాంక్-2లో గరిష్ట నీటి నిల్వ 3750 మిలియన్ లీటర్లకు గాను ప్రస్తుతం 2859.69 మిలియన్ టీటర్లు నీటి నిల్వ ఉందన్నారు. డీఈ గణపతి, ఏఈ అంజిరెడ్డి, ప్రసాదరావు, సిబ్బంది ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఆదేశించారు. కరవది డొంకలో జరుగుతున్న పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని అక్టోబర్ 2వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రయాణ ప్రాంగణాలు, శ్రమదాన్ ద్వారా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, కంటోన్మెంట్ బోర్డులు, బీచ్‌లు, పర్యాటక కేంద్రాలు, జంతు ప్రదర్శన శాలలు, పార్కులు, అభయారణ్యాలు, చారిత్రక స్మారక చిహ్నాలు, వారసత్వ ప్రదేశాలు, రివర్ ఫ్రంట్‌లు, ఘాట్‌లు, డ్రెయిన్లు ఇలా అన్ని పరిశుభ్రం చేయాలని పిలుపునిచ్చారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ఇంటింటి వద్ద ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బాలాజీ నగర్ అర్బన్ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పోతురాజు పాలెం, రామ్ నగర్, అన్నవరప్పాడు, సంతపేట, మరాఠి పాలెం, రంగుతోట, శారదా బాలకుటీర్ సచివాలయం పరిధిలో సర్వే చేపట్టామన్నారు.

స్త్రీ నిధి రుణాల రికవరీ వేగవంతం చేయాలి

- ప్రతి నెలా వంద శాతం రకవరీ ఉండేలా చూడాలి
- ఎన్‌పీఏలు లేకుండా చర్యలు తీసుకోవాలి
- డీఆర్‌డీఏ పీడీ తేళ్ల రవికుమార్



సమీక్షలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ తేళ్ల రవికుమార్

ఒంగోలు సబర్బన్: జిల్లా వ్యాప్తంగా స్త్రీ నిధి రుణాల రికవరీని వేగవంతం చేయాలని సీసీలు, ఏపీఎంలను డీఆర్‌డీఏ పీడీ తేళ్ల రవికుమార్ ఆదేశించారు. ఈ మేరకు స్థానిక టీటీడీసీ ప్రాంగణంలోని సమావేశం మందిరంలో మంగళవారం డీఆర్‌డీఏ సీసీలు, ఏపీఎంలతో సమీక్ష నిర్వహించిన పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. స్త్రీ నిధి రుణాల రికవరీ విషయంలో జిల్లా మొత్తం మీద వెనుకబడి ఉన్న 65 మంది సీసీలు, 31 మంది ఏపీఎంలను జిల్లా కేంద్రం ఒంగోలుకు పిలిపించారు. ఈ సందర్భంగా రుణాల రికవరీలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీసీలు క్లస్టర్‌లో రుణాల ఖాతాలను ఎన్‌పీఏ కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. రికవరీ తక్కువగా ఉన్న వీఓఏలతో కట్టించాల్సిన బకాయీ మొత్తం కట్టించటంతో పాటు వీఓ వంద శాతం రికవరీ ఉండేవిధంగా సీసీలు చర్యలు చేపట్టాలన్నారు. ఇక 31 మంది ఏపీఎంలు వారు పనిచేస్తున్న మండలాల్లో ఉన్న బకాయి మొత్తాన్ని ఈ నెల 30వ తేదీలోగా వసూలు చేయించి వంద శాతం రికవరీ ఉండే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్త్రీ నిధి రుణాల విషయంలో లబ్ధిదారులు జీవనోపాధిని ఏర్పాటు చేసుకునే విధానలో అర్హత కలిగి, అవసరమున్న ప్రతి ఎస్‌హెచ్‌జీకి రుణం ఇప్పించాల్సిందిగా ఆదేశించారు. గ్రూపు సభ్యుల కుటుంబాలు ఆర్థిక పరిస్థితులను మెరుగుపరుచుకునే విధంగా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఇక నుంచి రికవరీ విధానం పేటీఎం పేమెంట్ పద్ధతిలో చేయాలన్నారు. ఎన్‌పీఏలు ఎక్కువగా ఉన్న 65 మంది సీసీలు, 31 మంది ఏపీఎంలు ఈ నెలాఖరుకు కట్టించే విధంగా అంగీకారం తీసుకోవాలని కూడా సూచించారు. సమావేశంలో ఏజీఎం స్త్రీ నిధి చార్లెస్ హర్ష వర్ధన్, ఏపీఎం ఐబీ కృష్ణారావు, గంటా శ్రీనివాస రావు, డీపీఎం ఫైనాన్స్ నరిసింహారావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

అకౌంటెంట్లు బాధ్యతగా పనిచేయాలి

మండల సమాఖ్య అకౌంటెంట్లు బాధ్యతగా పనిచేయాలని డీఆర్‌డీఏ పీడీ తేళ్ళ రవి కుమార్ ఆదేశించారు. ఈ మేరకు మండల సమాఖ్యల అకౌంటెంట్లు, ఎల్‌సీ సీసీలతో పీడీ స్థానిక టీటీడీసీలో సమీక్ష నిర్వహించారు. అకౌంటెంట్లు మండల సమాఖ్య లీడర్లకు సహకరించాలని సూచించారు. సీఐఎఫ్, వీఆర్‌ఎఫ్ రికవరీ విషయలో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే మెయిల్స్ ఎప్పటికప్పుడు సిబ్బందికి తెలియజేయాలన్నారు. ఎల్‌సీ సీసీలు వారి విధి నిర్వహణ సక్రమంగా పాటించాలని కోరారు. మండల స్థాయిలో అన్ని రకాల ఆర్థిక లావాదేవీలను పర్యవేక్షించాలని, నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఎల్‌సీసీ నెలకు 15 గ్రామ సంఘాలు విజిట్ చేసి అక్కడ జరుగుతున్న ఆర్థిక లావాదేవీలపై సమగ్రమైన నివేదిక అందజేయాలన్నారు. ఎల్ సీసీ విధి నిర్వహణలో ఏవిధమైన ప్రలోభాలకు లోనుకాకుండా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ఆర్థిక అవకతవకలు లేకుండా చూడాల్సిన బాధ్యతను విస్మరించకూడదని తెలిపారు.

పార్లమెంట్ భవనం దేవాలయం

- ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి

ఒంగోలు: పార్లమెంట్ భవనాన్ని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి దేవాలయంతో పోల్చారు. 75 సంవత్సరాల పార్లమెంట్‌లో ప్రయాణం, విజయాలు, అనుభవాలు, జ్ఞాపకలుపై సోమవారం పార్లమెంట్లో జరిగిన చర్చలో మాగుంట మాట్లాడుతూ పార్లమెంట్ ఒక దేవాలయమని, 543 మంది సభ్యులకు దేవుడు ఇచ్చిన వరం అన్నారు. ఈ ఆలయంలో తాను 12 సంవత్సరాలపాటు సభ్యునిగా ఉండడం ప్రజాదేవుళ్లు ఇచ్చిన వరంగా పేర్కొన్నారు. జీ20 శిఖరాగ్ర సమావేశం విజయవంతంగా నిర్వహించి అంతర్జాతీయంగా తమన దేశానికి పేరు తెచ్చినందుకు ప్రధాని మోదీకి మాజీ ఎంపీ, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపినట్లు వివరించారు. 12వ లోక్‌సభలో తాను ఎంపీగా అడుగుపెట్టడం జరిగిందని, తన సోదరుడు మాగుంట సుబ్బిరామిరెడ్డి, తన వదన మాగుంట పార్వతమ్మ కూడా ఎంపీలుగా పార్లమెంట్‌కు విచ్చేసిన విషయాన్ని వివరించారు. 2006లో అప్పటి ప్రధాని వాజ్‌పేయి కాలంలో ఇండో యూఎస్ ఒప్పందం బిల్లు, 2008లో ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ యొక్క కాన్ఫడెన్స్ మోషన్ల సమయాల్లో ఉద్రిక్తమైన వాతావరణం ఏర్పడినప్పుడు దేవుని సంకల్పంతో సంతోషంగా గట్టిక్కామన్నారు. 2014లో ఏపీ రీఆర్గనైజేషన్ బిల్లు కూడా అర్ధరాత్రి ఉద్రిక్త వాతావరణంలోనే జరిగి ఏపీ రెండు రాష్ట్రాలుగా విభజన బిల్లు ఆమోదం పొందిందని, ఏపీకి ప్రత్యేక హోదా వాగ్దానం జరిగి 10 సంవత్సరాలుగా గడిచినా ఇంకా మంజూరు కాకపోవడం బాధాకరమన్నారు. లోటు బడ్జెట్‌తో ఏర్పడిన ఏపీ అభివృద్ధి చెందాలంటే ప్రత్యేక హోదా కల్పించాలని కోరుతున్నామన్నారు. 50 కోట్ల జనాభాకు 543 మంది పార్లమెంట్ సభ్యులను ఏర్పాటు చేసినపుడు 140 కోట్లమంది జనాభాకు పెరిగినందున ప్రజల సంరక్షణకోసం తదనుగుణంగా మంత్రులను, పార్లమెంట్ సభ్యులను, పనిదినాలను, రాష్ట్రాల అధికారాలను తప్పక పెంచాలన్నారు. ప్రజాస్వామ్య దేవాలయమైన పార్లమెంట్‌లో ఎక్కువ శాతం కోటీశ్వరులే ఉండడం పార్లమెంట్ సభ్యునిగా ఉండేందుకు చట్టం తేవాలని కోరుతూ నూతన పార్లమెంట్ భవనంలో కూడా అన్నీ బాగానే జరుగుతాయని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య దేవాలయమైన పార్లమెంట్‌లో ఎక్కువ శాతం కోటీశ్వరులే ఉండడం సరికాదని, సర్పంచ్ తదితర అన్ని స్థాయిల్లోని వారిని పార్లమెంట్ సభ్యులుగా ఉండేలా చట్టం తేవాలని కోరుతున్నట్లు పేర్కొంటూ స్పీకర్, ప్రధానమంత్రి, మంత్రులకు, ఎంపీలకు కృతజ్ఞతలు తెలిపారు.

కొత్త పోలింగ్ కేంద్రాల కసరత్తు పూర్తి



సమావేశం నిర్వహిస్తున్న ఆర్‌డీఓ విశ్వేశ్వరరావు

ఒంగోలు అర్బన్: నియోజకవర్గ పరిధిలో కొత్తగా ఏర్పాటు చేయాల్సిన పోలింగ్ కేంద్రాలకు సంబంధించి కసరత్తు పూర్తి అయింది. ఆ మేరకు మంగళవారం ఆర్‌డీఓ కార్యాలయంలో ఆర్‌డీఓ విశ్వేశ్వరరావు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి వివరాలు తెలియజేశారు. ఒంగోలు నగరం, కొత్త పట్నం, ఒంగోలు రూరల్ మండలాల్లోని మొత్తం పోలింగ్ కేంద్రాలను ఓటర్లకు అనుకూలంగా ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. 1400 ఓట్లు దాటిన పోలింగ్ కేంద్రాలను మూడు గుర్తించి అదనంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీంతో నియోజకవర్గంలో 256 పోలింగ్ కేంద్రాలు 259కు పెరిగాయన్నారు. లొకేషన్ మార్పులు 15, ఒకే భవనంలో గదులు మార్పు చేసినవి 25 పోలింగ్ కేంద్రాలు న్నట్లు తెలిపారు. దీనిలో ఏసీపీ వెంకటేశ్వర్లు, టీపీఓ శివప్రసాద్, తహసీల్దారు రమణారావు, డీటీలు అర్జున్‌రెడ్డి, విజయ్‌కుమార్ రెడ్డి, రఫీ, వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు స్వరూప్, రాజశేఖర్, సత్యం, రసూల్ పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యం

పొదిలి రూరల్: రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలన్న ఏకైక లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందని మండల జేసీఎస్ కన్వీనర్ పేరం సుభాష్ చంద్రబోస్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పొదిలి మండలంలోని కుంచేపల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను ఆయన ప్రారంభించారు. అనంతరం ఏఎన్‌ఎంలు, ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలపై అవగహన కల్పించారు. ప్రజల ఆరోగ్య వివరాలను యాప్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో కొమ్మసాని వెంకటరెడ్డి, పాల్గొన్నారు.

జగనన్న సురక్షపై అవగాహన కల్పించాలి

గిద్దలూరు రూరల్: జగనన్న సురక్షపై ఆరోగ్య ప్రజలకు అవగాహన కల్పించాలని అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి మహబూబ్ షరీఫ్ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని కోటగడ్డ వీధిలో సోమవారం ఇంటింటి సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లు, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ప్రజల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకునేందుకు ఇంటింటా తిరుగుతూ వారి ఆరోగ్య వివరాలు సేకరిస్తున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష జయప్రదం చేయండి



జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జయప్రదం చేయండని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం చీమకుర్తిలోని వైద్యసిబ్బంది జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే కార్యక్రమంలో వెంకాయమ్మ నివాసానికి వెళ్ళి పరీక్షించారు. బీపీ, ఇతర పరీక్షలను నిర్వహించి ఆరోగ్య వివరాలను తెలియజేశారు. వెంకాయమ్మ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.